అంతర్గత రోడ్లు బురదమయం

- పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం
- ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు
- ఏటా వర్షాకాలం ఇదే పరిస్థితి


డ్రైనేజీ ప్లాట్‌ఫాం మీదుగా వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

రామగుండం: ఇటీవల కురిసిన వర్షాలకు రామగుండం కార్పొరేషన్ పరిధి డివిజన్లలోని పలు కాలనీల్లో పేరుకుపోయిన బురద సమస్య నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. రామగుండం పట్టణ పరిధి 22వ డివిజన్‌లోని రాంనగర్, జీరోపాయింట్ తదితర కాలనీల్లోని అంతర్గత రహదారులపై బురదనీరు నిలిచి ఉంది. మరికొన్ని చోట్ల వరదనీటి ధాటికి ముళ్ల చెట్లు విరిగి రోడ్డుపక్కకు కుప్పలుగా పేరుకుపోయాయి. రాంనగర్‌లోని పాత బ్యాంకు బిల్డింగ్ వెనుక వైపు, ఏఎస్ ఫంక్షన్‌హాల్ వీధిలో అపరిశుభ్రంగా మారింది. ప్రముఖ హార్డ్‌వేర్ షాపు పక్కనే ఉన్న గల్లీలోని డ్రైనేజీ పూర్తిగా పూడికతో నిండిపోవడంతో భారీ వర్షం కురిసిన ప్రతీసారి వరద పోటెత్తడంతో సమీపంలోని గృహాల్లోకి వరద నీరు చేరుతుంది. గతంలో జీరోపాయింట్ ఏరియా నుంచి మజీద్ కార్నర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న డ్రైనేజీ మట్టితో కూరుకుపోయి పూర్తిగా శిథిలమై ఉండడంతో వరద నీరు ప్రధాన రహదారిపైకి చేరుతుంది.

పన్నులు చెల్లిస్తున్నాం



ఇటీవల కురిసిన వర్షాలకు మా ఇంటి ఎదుట పూర్తిగా బురదమయమైంది. ఇంటి పక్కనే స్కూల్ ఉండడంతో నిత్యం వందలాది మంది విద్యార్థులు ఇదే రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై బురద ఉండడంతో డ్రైనేజీ ప్లాట్‌ఫాంపై రాకపోకలు సాగిస్తున్నారు. స్కూల్‌తో పాటు మా ఇంటికి పన్నుల రూపేణా ఏటా రూ.20వేలు చెల్లిస్తున్నాం. పారిశుధ్య సిబ్బందిని శుభ్రం చేయాలని కోరితే ఎవరి ఇంటి ముందు వారే క్లీన్ చేసుకోవాలని అంటున్నారు. – బల్వాన్‌సింగ్‌ఠాకూర్, రాంనగర్ కాలనీవాసి

త్వరలోనే శాశ్వత పరిష్కారం



రాంనగర్, జీరోపాయింట్ తదితర కాలనీల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాల సమయంలో నేనే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వరద నీరు నిల్వకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాను. ప్రధాన రహదారి నిర్మాణానికి గతేడాది ప్రతిపాదిస్తే కొన్ని సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. త్వరలోనే ప్రధాన రహదారి సమీపంలో డ్రైనేజీ నిర్మాణం చేపడితే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. – కౌశిక లత, కార్పొరేటర్

వేగంగా అభివృద్ధి పనులు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ

మంథని: మంథని మున్సిపాలిటీకి ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.కోటి నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సాధారణ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. బొక్కలవాగు, తమ్మిచెరువు, రావులచెరువు కట్టలపై సిమెంట్ రోడ్లతో పాటు పట్టణంలో పలు వీధుల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పట్టణంలో మరో వెయ్యి మొక్కలు నాటేందుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరెపల్లి కుమార్, కమిషనర్ సతీశ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు ఉన్నారు.

గౌడబంధు ప్రకటించాలని నిరసన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న గీత కార్మికులు

కమాన్‌పూర్: గీత కార్మికులకు ప్రభుత్వం గౌడబంధు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజిగౌడ్ మాట్లాడుతూ గీత వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న గీత కార్మికులకు సీఎం కేసీఆర్ గౌడబంధు ప్రకటించి ఆదుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేగోలపు శంకర్‌గౌడ్, మండల అధ్యక్షుడు నగునూరి నర్సయ్య, పల్లెర్ల శ్రీనివాస్, బత్తిని నాగమణి, రంగు సత్యనారాయణ, బొమ్మగాని అనిల్, గండి మమత, బైరి అంజయ్య, కోలా నర్సగౌడ్ పాల్గొన్నారు.

పచ్చని మొక్కలు పర్యావరణానికి సూచికలు


మొక్కలు పంపిణీ చేస్తున్న ఎన్వీ రమణారెడ్డి

జ్యోతినగర్: పచ్చని మొక్కలు పర్యావరణానికి సూచికలు అని, ప్రతి కుటుంబంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి అన్నారు. డివిజన్‌లోని దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. ఆర్పీ రాణి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మొక్కలు

రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ న్యూపీకే రామయ్యకాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు జి.సంధ్యవాణి, ఎండీ.వహీద్ ఖాస్ పండ్ల మొక్కలతో పాటు పూల మొక్కలు అందించారు. చిన్నారులు మొక్కలను పాఠశాల ఆవరణలోని ఖాళీ స్థలంలో నాటారు.

గృహలక్ష్మి దరఖాస్తులతో వెళ్లి ఇంటింటా సర్వే చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ మోహన్‌రెడ్డి


ఓదెల: దరఖాస్తులు పరిశీలిస్తున్న కార్యదర్శులు

కమాన్‌పూర్: మండల పరిధిలో గృహలక్ష్మి పథకానికి ప్రజలు చేసుకున్న దరఖాస్తులతో వెళ్లి ఇంటింటా సర్వే చేయాలని తహసీల్దార్ మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని 9 గ్రామపంచాయితీల పరిధిలో 1110 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు. గ్రామాలవారీగా దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. మండల పరిధిలో ఎంపీవో, పీఆర్ ఏఈ, ఆర్‌ఐలతో టీఎం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

అర్హులందరికీ గృహలక్ష్మి

ఓదెల: అర్హులందరికీ గృహలక్ష్మి పథకం అందుతుందని ఓదెల తహసీల్దార్ యాకన్న పేర్కొన్నారు. ఓదెల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సంబంధిత శాఖాధికారులతో, కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఖాళీ స్థలాలతో పాటు పట్టా సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీవో వాజీద్, సూపరింటెండెంట్ శ్రీధర్, ఎంపీవో రమేశ్, కార్యదర్శిలు భానుప్రసాద్, శ్రీకాంత్, శ్రీనివాస్, కిరణ్, దిలీప్, రమేశ్ నవ్య అనిత పాల్గొన్నారు.

2286 దరఖాస్తుల స్వీకరణ

ఓదెల: గృహలక్ష్మి పథకం కోసం మండలంలోని 22 గ్రామాల నుంచి 2286 దరఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ యాకన్న శుక్రవారం వెల్లడించారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఎలిగేడు: ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ గొల్లే కావేరి అన్నారు. మండలంలోని ధూళికట్టలో స్వచ్ఛ శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధులను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. హరితహారంలో మొక్కలు నాటడం, వాటిని మొక్కల సంరక్షణ, నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్‌మహమూద్, అంగన్‌వాడీ టీచర్లు భారతి, ప్రభావతి, వెంకటమ్మ, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలు స్వశక్తితో ఎదగాలి


మిషన్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఓదెలు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన రజియ సుల్తానాకు గ్రామైక్య సంఘం వారు రూ.2 లక్షల కొనుగోలు చేసిన పేపర్ ప్లేట్ల మిషన్‌ను శుక్రవారం సర్పంచ్ ఆకుల ఓదెలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదుగుతూ నలుగురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఏపీఎం శైలజకాంతి, సీసీ ఎల్లమ్మ, వీవోఏ రజిత పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి


బట్ట సంచులు పంపిణీ చేస్తున్న శ్యామల

జూలపల్లి: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులు వాడాలని బీఆర్‌ఎస్ నాయకురాలు గ్యాజంగి శ్యామల సూచించారు. మండలంలోని తేలుకుంటలో కేసీఆర్ సేవాదళం ఆధ్వర్యంలో ముద్రించిన బట్ట సంచులను గ్రామంలోని మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రమీల, దేవమ్మ, కోటగిరి పద్మ ఉన్నారు.

శుద్ధ జలయంత్రం అందజేత


శుద్ధ జలయంత్రం అందజేస్తున్న రాంబాబు

ఓదెల: మండలంలోని పొత్కపల్లి ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పుల్లూరి రాంబాబు అనే చిరువ్యాపారి రూ.15వేల విలువైన శుద్ధ జలయంత్రం శుక్రవారం అందజేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సమ్మన్న, సర్పంచ్ ఆళ్ల రాజిరెడ్డి, బీజేపీ నాయకులు పుల్లూరి పృథ్వీరాజ్, శనిగరపు రమేశ్, బండారి శ్రీకాంత్, రమేశ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

జూలపల్లి: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందని జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవితో కలిసి ఆయన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇచ్చి రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపిన సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డలకు అండగా నిలిచేందుకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. డీటీ అబూబాకర్, సర్పంచ్ మేచినేని సంతోష్‌రావు, ఎంపీటీసీలు దండె వెంకటేశం, తమ్మడవేని మల్లేశం, ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, కోఆప్షన్ సభ్యుడు లాల్‌మహ్మద్ ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగ్స్ అందజేత


బ్యాగులతో విద్యార్థులు

కమాన్‌పూర్: యూత్ ఫర్ సేవ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కమాన్‌పూర్, రొంపికుంట, జూలపల్లి, వెంకట్రావ్‌పల్లె ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్, డిక్షనరీలు అందజేశారు. ఎంఈవో సంపత్‌రావు, ఆర్గనైజేషన్ వలంటీర్లు రజిత, మహేశ్, శరత్, శ్రీకాంత్, కల్యాణ్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

కమాన్‌పూర్: కమాన్‌పూర్ తహసీల్దార్‌గా విధుల్లో చేరిన మోహన్‌రెడ్డిని శుక్రవారం మండల సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో సన్మానించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బొల్లపెల్లి శంకర్‌గౌడ్, సర్పంచ్‌లు తాటికొండ శంకర్, కొండ వెంకటేశ్, నీలం సరిత, కట్కకం రవీందర్, ఇటవేన కొమురమ్మ ఉన్నారు.

పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ తీస్తున్న పోస్టల్ సిబ్బంది

గోదావరిఖనిటౌన్: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా 2.0లో భాగంగా శుక్రవారం స్థానిక పోస్టాఫీసు నుంచి ప్రధాన చౌరస్తా మీదుగా రామగుండం కార్పొరేషన్ ఆఫీస్, గోదావరిఖని బ్రిడ్జి వరకు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా గోదావరిఖని సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అరికిల్ల నరేశ్ పాల్గొన్నారు. ప్రతి పోస్టాఫీసులో జాతీయ జెండాలు అందుబాటులో ఉన్నాయని, కేవలం రూ.25 చెల్లించి జాతీయ జెండా పొందవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా www.epostoffice.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి జాతీయ జెండా నేరుగా ఇంటి వద్దకే డెలివరీ చేయనున్నట్లు పేర్కొన్నారు. గోదావరిఖని పోస్టు మాస్టర్ వేణుగోపాల్, మెయిల్ ఓవర్సీస్ సతీశ్, పోచయ్య పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

ధర్మారం: మండల కేంద్రంలో ఎరుకల ఏకలవ్య కమ్యూనిటీ భవన నిర్మాణానికి శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి భూమిపూజ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ మంత్రి కొప్పుల ఈశ్వర్ సహకారంతో అధికారులు భవన నిర్మాణానికి స్థలం కేటాయించారని తెలిపారు. సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, కొఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, దేవి రాజలింగయ్య, ఎరుకల సంఘం మండల అధ్యక్షుడు మానుపాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మానుపాటి సాయిలు, ఉపాధ్యక్షులు బాలయ్య, నార్ల రాజయ్య, కోశాధికారి సాగర్, నాయకులు మానుపాటి తిరుపతి, రవి, రమేశ్ పాల్గొన్నారు.

పద్మశాలీ గర్జనను విజయవంతం చేయండి

సుల్తానాబాద్: పద్మశాలీ గర్జనను విజయవంతం చేయాలని పద్మశాలీ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెగడ చందు పిలుపునిచ్చారు. ఈ నెల 13న కోరుట్లలో నిర్వహించనున్న పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని, పద్మశాలీలకు రాజ్యాధికార సాధన కోసం తలపెట్టిన కోరుట్ల పద్మశాలీ ప్రజాగర్జనను జిల్లాలోని అన్ని మండలాల గ్రామాల నుంచి పద్మశాలీలు అధిక సంఖ్యలో తరలివచ్చి పద్మశాలీ గర్జనను విజయవంతం చేయాలని కోరారు. పద్మశాలీలు వచ్చే ఎన్నికల్లో ఐక్యంగా ఉండి పద్మశాలీ అభ్యర్థులను పార్టీలకు అతీతంగా గెలిపించి అసెంబ్లీలో పద్మశాలీ సత్తాను చాటే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నుంచి అధ్యక్షుడు వేముల రామ్మూర్తి ప్రధాన కార్యదర్శి అయిల రమేశ్, ఉపాధ్యక్షులు సాయిరి మహేందర్, వలస నీలయ్య ఆధ్వర్యంలో భారీగా బయలుదేరి వెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

కమాన్‌పూర్: రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే పంట దిగుబడి సాధించుకోవచ్చని ఏవో బండి ప్రమోద్‌కుమార్ అన్నారు. మండలంలోని గుండారం, లింగాల రైతు వేదికలో రైతులకు సాగు విధానం, పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు ఎక్కువశాతం ఆయిల్‌పాం సాగుపై దృష్టిసారిస్తే రానున్న కాలంలో అధిక దిగుబడి లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఏఈవోలు యాదగిరి శ్రీనివాస్, సురేశ్, అనిల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦చెక్కు అందజేత

కమాన్‌పూర్: మండలంలోని గొల్లపల్లెకు చెందిన మిట్టపల్లి విజయకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.12వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో చిగురు భూమయ్య, గుమ్మడి శ్రీనివాస్, మేకల కొమురయ్య, చంద్రయ్య, పోసాని సంతోష్, ఆకుల రవి, చేగొండ ఓదెలు పాల్గొన్నారు.

✦పారదర్శకంగా ఎంపిక చేయాలి

పాలకుర్తి: గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక పూర్తిస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని మండల తహసీల్దార్ జ్యోతి కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శులు, ఇతర అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ జ్యోతి అధికారులకు పలు సూచనలు చేశారు. టీం లీడర్లు నిష్పక్షపాతంగా వ్యవహరించి అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. ఎంపీవో షబ్బీర్‌పాషా, ఆర్‌ఐ భానుకుమార్ పాల్గొన్నారు.

✦మైదంబండలో తాగునీటి సరఫరా బంద్

ముత్తారం: మండలంలోని మైదంబండలో నాలుగో వార్డులో వారంరోజుల నుంచి తాగునీరు సరఫరా బంద్ కావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పగిలిన నీటి సరఫరా పైప్‌లైన్‌కు మరమ్మతు చేయకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తిందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

✦విద్యార్థులకు యూనిఫాం

జూలపల్లి: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు రెండో విడతలో సరఫరా అయిన యూనిఫాంను ప్రధానోపాధ్యాయుడు పి.లచ్చయ్య శుక్రవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు వీరమల్లు, కన్నయ్య, ఆఫీస్ సబార్డినేట్ రహమాన్ ఉన్నారు.

✦పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జీలకుంటకు చెందిన రౌతు కవీశ్వర్ అనే టీచర్ స్కూల్ ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో సెల్‌ఫోన్ పడిపోయింది. ఎస్సై శ్రీధర్ సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి ఉపాధ్యాయుడికి అందజేశారు.

✦బీసీబంధు పథకం లబ్ధిదారుల ఎంపిక

ముత్తారం: బీసీబంధు పథకంలో భాగంగా మండలంలో ఐదుగురు లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు శుక్రవారం ఎంపీపీ జక్కుల ముత్తయ్య తెలిపారు. మండలంలోని అడవి శ్రీరాంపూర్‌కు చెందిన రాసమల్ల ఈశ్వరి, దర్యాపూర్‌లో మామిడి వాణి, ముత్తారంలో అలువోజు రాజు, ఓడేడులో కట్ల రమణాచారి, లక్కారంలో మడుపు సువర్ణను ఎంపిక చేసినట్లు ఎంపీపీ పేర్కొన్నారు.

✦తహసీల్దార్‌కు సన్మానం

రామగిరి: మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాంచందర్‌ను శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. బీఆర్‌ఎస్ నాయకులు రాజుగౌడ్, కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

✦అభివృద్ధి కమిటీ ర్పాటు చేయండి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో జీఓ ప్రకారం వెంటనే అభివృద్ధి కమిటీని నియమించాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. అభివృద్ధి కమిటీ లేకపోవడంతో ఇష్టానుసారంగా చేపడుతున్న పనులపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆరోపించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వేరే పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తారుపల్లి, వెన్నంపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజకొమురయ్య, సర్పంచు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు రాంచంద్రం, దేవేందర్ పాల్గొన్నారు.

గద్దర్ మృతి అణగారిన వర్గాలకు తీరని లోటు

పాలకుర్తి: ప్రజా గాయకుడు, జననాట్యమండలి వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దర్ మృతి చాలా బాధాకరమని, అణగారిన వర్గాలకు తీరని లోటు అని పాలకుర్తి జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం గద్దర్ సమాధిని సందర్శించి నివాళి అర్పించారు. అనంతరం గద్దర్ కుటుంబసభ్యులను పరామర్శించారు. నాయకులు కందుల పోచం, కండె సాగర్, శ్రావణ్, బబ్లూ, ఉమర్, హరీశ్ ఉన్నారు.

జవాన్లకు సన్మానం


జవాన్లను సన్మానిస్తున్న నాగరాజు

సుల్తానాబాద్: దేశం కోసం ఆర్మీ జవాన్లు చేస్తున్న సేవలను గుర్తుంచుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు కోరారు. రిటైర్డ్ అయిన ఆర్మీ జవాన్లను శుక్రవారం పట్టణంలో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సీనియర్ నాయకులు సదయ్యగౌడ్, చిట్టవేని సదయ్య, పవన్, సతీశ్, బుర్ర సతీశ్‌గౌడ్, ఆరెపల్లి రాకేశ్, తొర్రికొండ అజయ్ పాల్గొన్నారు.

గోదావరి బ్రిడ్జిపై రాస్తారోకో

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖనికి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు గురువారం అనుమానాస్పదంగా నదిలోదూకి గల్లంతయ్యాడు. ఈ ఘటనలో అతని ఆచూకీ కోసం రామగుండం పాలక సంస్థ, పోలీస్‌శాఖ వారు 24 గంటలు దాటినా చర్యలు తీసుకోలేదంటూ ఆరోపిస్తూ సదరు వ్యక్తి సంబంధీకులు గోదావరి బ్రిడ్జి వద్ద రోడ్డుపై బైఠాయించి శుక్రవారం ధర్నా రాస్తారోకో నిర్వహించారు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సదరు వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్నామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాయకురాలు జ్యోతి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. 36రోజులుగా పార్ట్ టైం స్వీపర్ల సమ్మెతో స్కూళ్లలో పరిశుభ్రత లోపించిందని పేర్కొన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జోక్యం చేసుకొని స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాయలింగు, లక్ష్మణ్, చిన్న రాజయ్య, లక్ష్మి, స్వామి, అనసూయ పాల్గొన్నారు.

సమాచారం

✦నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: విద్యుత్ ఉపకేంద్రాల మరమ్మతు దృష్ట్యా గోదావరిఖనిలోని పీజీ సెంటర్, రాంమందిర్, జనగాం, అల్లూరు ఏరియాల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గోదావరిఖని ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

✦మంథనిలో..

మంథని: మంథని, గుంజపడుగు, నాగారం విద్యుత్ ఉప కేంద్రాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మల్లయ్య తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రాల మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 7 గంటల నుంచి 10 వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

✦లక్కారంలో..

ముత్తారం: మండలంలోని లక్కారం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ హనుమాన్ దాసు తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతు పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

✦సుల్తానాబాద్‌లో..

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్‌తో పాటు నారాయణపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శంకర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

✦కమాన్‌పూర్‌లో..

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రొంపికుంట విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో చేపడుతున్న మరమ్మతు పనుల నేపథ్యంలో శనివారం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజేంద్రకుమార్ తెలిపారు.